నేడు బీఆర్ఎస్ కార్యాలయం ప్రారంభం

ఉట్నూర్, ఫిబ్రవరి 12 : ఆదిలాబాద్ జిల్లా ఉట్నూర్ అంగడిబజార్‌లోని బీఆర్ఎస్ పార్టీ నూతన కార్యాలయాన్ని గురువారం మధ్యాహ్నం 12.30 గంటలకు ఖానాపూర్ నియోజకవర్గ ఇన్‌చార్జి భూక్యా జాన్సన్ నాయక్ ప్రారంభించనున్నట్లు మండల ఇన్‌చార్జి అధ్యక్షుడు పంద్ర జైవంత్‌రావ్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమానికి పార్టీ నాయకులు, కార్యకర్తలు, అనుబంధ సంఘాల నాయకులు పాల్గొనాలని కోరారు.

27న ఉద్యోగులకు సెలవు

ఎదులాపురం, ఫిబ్రవరి 12: గ్రాడ్యుయేట్ ఉపాధ్యాయ ఎన్నికల సందర్భంగా ఈ నెల 27వ తేదీన ప్రభుత్వ ఉద్యోగులకు క్యాజువల్ లీవ్ ప్రకటించినట్లు కలెక్టర్ రాజర్షి షా ఒక ప్రకటనలో తెలిపారు. ఉద్యోగులు ఎన్నికల్లో తమ ఓటు హక్కును వినియోగించుకోవడానికి సెలవు ప్రకటించినట్లు పేర్కొన్నారు.

ఎన్నికల నిబంధనలు పాటించాలి

దస్తురాబాద్, ఫిబ్రవరి 12 : ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ అమలు ఉన్న నేపథ్యంలో ఎన్నికల నిబంధనలు పాటించాలని ఎస్ఐ శంకర్ అన్నారు. నిర్మల్ జిల్లా దస్తురాబాద్‌తో పాటు మండలంలోని రేవోజిపేట, భూత్కుర్ ఎక్స్ రోడ్డు వద్ద వాహనాలను ఆయన తనిఖీ చేశారు. ఎన్నికల నిబంధనలు ఉల్లంఘిస్తే చట్ట పరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

జాబ్ కార్డు ఉన్న ప్రతి ఒక్కరికీ పని కల్పించాలి

లక్ష్మణచాంద, ఫిబ్రవరి 12 : జాబ్‌కార్డు కలిగిన ప్రతి ఒక్కరికీ పని కల్పించాలని డీఆర్డీవో విజయలక్ష్మి పేర్కొన్నారు. మంగళవారం నిర్మల్ జిల్లా లక్ష్మణచాందలోని ఎంపీడీవో కార్యాలయంలో మండలంలోని పంచాయతీ కార్యదర్శులు, ఉపాధి హామీ సిబ్బందితో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఆసక్తి గల రైతులతో పండ్ల తోటల సాగు, నాడెపు కాంపోస్టులు పెట్టేలా ప్రోత్సహించాలని సూచించారు. అనంతరం మండలంలోని పొట్టపెల్లి(కే) గ్రామంలో నిర్వహిస్తున్న నర్సరీని పరిశీలించారు. నర్సరీలో పండ్లు, పూల మొక్కలతో పాటు డ్రాగన్ మొక్కలు పెంచడంతో అభినందించారు. కార్యక్రమంలో ఎంపీడీవో రాధిక, ఎంపీవో అమీర్‌ఖాన్, పంచాయతీ కార్యదర్శులు, ఉపాధి హామీ సిబ్బంది పాల్గొన్నారు.

మిషన్ భగీరథ నీటి పరీక్షలు

నిర్మల్ చైన్‌గేట్, ఫిబ్రవరి 12: నిర్మల్‌కు సరఫరా చేసే మిషన్ భగీరథ మాడేగాం నీటి శుద్ధీకరణ నుంచి ఆకుపచ్చ రంగు, వాసనతో కూడిన నీటి సరఫరా చేస్తున్నట్లు ప్రజలు ఫిర్యాదులు చేయగా అధికారులు నీటిని పరీక్షల నిమిత్తం పంపించారు. ప్రయోగశాలలో పరీక్షలు చేయగా నీరు నాణ్యత పరిమితులకు లోబడి ఉన్నట్లు నిర్ధారించినట్లు అధికారులు తెలిపారు. ఈ సమస్యను పూర్తిగా నివారించేందుకు మాడేగాం నీటి శుద్ధీకరణ కేంద్రం అధికారులు తగు చర్యలు తీసుకుందని తెలిపారు.

క్రీడలతో ఆరోగ్యం

నార్నూర్, ఫిబ్రవరి 12 : వ్యాయమం, క్రీడలతో ఆరోగ్యంగా ఉంటారని క్రీడ విభాగం జిల్లా అధికారి పార్థసారథి అన్నారు. బుధవారం ఆదిలాబాద్ జిల్లా నార్నూర్‌లోని గిరిజన సంక్షేమ ఆశ్రమోన్నత బాలికల పాఠశాలను సందర్శించారు. ఆయనను ఉపాధ్యాయులు శాలువాతో సన్మానించారు. విద్యార్థులతో మాట్లాడారు. పదో తరగతి పరీక్షల్లో ఉత్తీర్ణత శాతం సాధించేందుకు ప్రణాళికబద్ధంగా చదువుకోవాలన్నారు. అలాగే ఆరోగ్య విషయంపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు జాదవ్ విఠల్, వార్డెన్ వనిత, పీడీ విశ్వనాథ్, ఉపాధ్యాయులు ఉన్నారు.

సమస్యలు పరిష్కరిస్తా

- బోథ్ ఎమ్మెల్యే జాదవ్ అనిల్
- కొత్తపల్లె, రేండ్లపల్లె గ్రామాల్లో పర్యటన

బోథ్: కొత్తపల్లెల్లో పర్యటిస్తున్న బోథ్ ఎమ్మెల్యే జాదవ్ అనిల్

బోథ్, ఫిబ్రవరి 12 : గ్రామాల్లోని సమస్యలు తన దృష్టికి తీసుకువస్తే పరిష్కరిస్తానని బోథ్ ఎమ్మెల్యే జాదవ్ అనిల్ అన్నారు. బుధవారం ఆదిలాబాద్ జిల్లా బోథ్ మండలం నక్కలవాడ గ్రామ పంచాయతీ పరిధిలోని కొత్తపల్లె, రేండ్లపల్లె గ్రామాలను సందర్శించారు. గ్రామస్తులు ఎమ్మెల్యేకు ఘన స్వాగతం పలికారు. గిరిజనులు డోలు వాయిస్తూ, మహిళలు మంగళహారతులతో స్వాగతించారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఏ సమస్య ఉన్నా తన దృష్టికి తీసుకురావాలన్నారు. అందుబాటులో ఉంటూ సమస్యలు పరిష్కరిస్తానని తెలిపారు. గ్రామాల్లో మౌలిక సదుపాయల కోసం అవసరమైన అభివృద్ధి పనులకు నిధులు కేటాయిస్తామన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల కన్వీనర్ నారాయణ రెడ్డి, బోథ్ మాజీ జడ్పీటీసీ సంధ్యారాణి, మాజీ సర్పంచ్‌లు సురేందర్ యాదవ్, శ్రీధర్ రెడ్డి, బీఆర్ఎస్ నాయకులు ఎల్క రాజు, డాక్టర్ స్వామి, రూప్‌చంద్, అల్లకొండ ప్రశాంత్, మడావి సుశీల, భీంరావ్, గంగారాం పాల్గొన్నారు.

బీఆర్ఎస్ హయాంలోనే ఆలయాలు అభివృద్ధి

గుడిహత్నూర్, ఫిబ్రవరి 12 : బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలోనే ఆలయాలు అభివృద్ధి చెందాయని బోథ్ ఎమ్మెల్యే జాదవ్ అనిల్ అన్నారు. ఆదిలాబాద్ జిల్లా గుడిహత్నూర్ మండలం సోయంగూడ గ్రామంలోని శివలింగాలయంలో ఆయన ప్రత్యేక పూజలు చేశారు. గ్రామస్తులు ఆయనను శాలువాతో సన్మానించారు. కార్యక్రమంలో లచ్చు మహారాజ్, బీఆర్ఎస్ నాయకులు తిరుమల్‌గౌడ్, శగీర్‌ఖాన్, సంజీవ్ ముండె, ఆవుల రమేష్, తెలంగే మాధవ్, ప్రకాశ్, జమీల్ పాల్గొన్నారు.

ఆధ్యాత్మికతతోనే మానసిక ప్రశాంతత

ఇచ్చోడ, ఫిబ్రవరి 12: ఆధ్యాత్మికతతోనే మానసిక ప్రశాంతత లభిస్తుందని ఎమ్మెల్యే జాదవ్ అనిల్ అన్నారు. ఇచ్చోడ మండలంలోని ఇస్లాంనగర్ గ్రామంలో జరుగుతున్న పూలాజీ బాబా ఆశ్రమ వార్షికోత్సవానికి ఎమ్మెల్యే హాజరయ్యారు. నూతన ఆశ్రమ ప్రారంభోత్సవంలో పాల్గొన్నారు. అనంతరం ఎమ్మెల్యేను ఆశ్రమ సభ్యులు శాలువాతో సన్మానించారు. కార్యక్రమంలో నేరడిగొండ మాజీ ఎంపీపీ రాథోడ్ సజన్, నాయకులు శ్రీరామ్‌నాయక్, మారుతి, లింబాజీ పాల్గొన్నారు.

నేరడిగొండ, ఫిబ్రవరి 12 : ఆదిలాబాద్ జిల్లా నేరడిగొండ మండలంలోని రోల్‌మామడ సమీపంలోని గురుసాహెబ్ ఆలయం వద్ద బండారా మహాప్రసాద కార్యక్రమానికి బోథ్ ఎమ్మెల్యే జాదవ్ అనిల్ హాజరై ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ రాథోడ్ సజన్, మాజీ జడ్పీటీసీ సయ్యద్ జహీర్, పీఏసీఎస్ మాజీ చైర్మన్ నానక్‌సింగ్, కిష్టాపూర్ మాజీ సర్పంచ్ గీత, నాయకులు కరణ్‌సింగ్, గులాబ్ సింగ్, ప్రతాప్‌సింగ్, కిష్టాపూర్ గ్రామస్తులు పాల్గొన్నారు.

దరఖాస్తులు సరే.. సంక్షేమ పథకాల సంగతేమిటి?

- మండల స్థాయి పైలెట్ ప్రజావాణిపై కరువైన అవగాహన

బజార్‌హత్నూర్, ఫిబ్రవరి 12: ఆదిలాబాద్ జిల్లా బజార్‌హత్నూర్‌లోని రైతువేదికలో మండల ప్రత్యేకాధికారి మోహన్ ఆధ్వర్యంలో బుధవారం ఆయా శాఖల అధికారులతో కలిసి పైలెట్ ప్రజావాణి కార్యక్రమం నిర్వహించారు. మండలంలోని వివిధ గ్రామాల ప్రజల నుంచి అధికారులు దరఖాస్తులు స్వీకరించారు. ప్రతి సారి దరఖాస్తులు ఇవ్వడమే తప్ప సంక్షేమ పథకాల సంగతి ఏమిటని ప్రజలు ప్రశ్నించారు. గ్యాస్ సబ్సిడీ, రుణమాఫీ, గృహజ్యోతి, పింఛన్లు రావడం లేదని దరఖాస్తు చేసుకొని ఏడాది గడుస్తున్న అందడం లేదని లబ్ధిదారులు ఆవేదన వ్యక్తం చేశారు.

కరువైన అవగాహన

మండల స్థాయి పైలెట్ ప్రజావాణిపై ప్రజల్లో అవగాహన కరువైంది.

సమస్యలను అధికారులకు తెలియజేస్తున్న అర్జీదారులు

మండలంలోని 30 గ్రామ పంచాయతీల్లో నుంచి 18 మంది వచ్చి తమ సమస్యలు పరిష్కరించాలని అధికారులకు అర్జీలు అందజేశారు.

రుణమాఫీ కాలేదు

నాకు ఐదు ఎకరాల పది గుంటల భూమి ఉంది. బజార్‌హత్నూర్ గ్రామీణ బ్యాంకులో రూ.లక్ష 60 వేల రుణం తీసుకున్నాను. కానీ రాష్ట్ర ప్రభుత్వం అందించిన రుణమాఫీ నాకు వర్తించలేదు. ఆన్‌లైన్‌లో పట్టపాసు పుస్తకం లేదని చూపిస్తోందట ప్రతి సారి అధికారుల చుట్టు తిరిగిన నా సమస్య పరిష్కారం కావడం లేదు. ఈ సారైనా అధికారులకు నా సమస్యను తెలియజెప్పాను. పరిష్కారం చేస్తారా అనే నమ్మకం పోయింది. అర్హత ఉండి కూడా అనార్హుడిగా ఉన్నాను. ఎన్నిసార్లు కాగితాలు ఇచ్చిన సమస్య మాత్రం తీరడం లేదు.

-సెడ్మాకి సుదర్శన్, రైతు, గ్రామం డెడ్రా

గుర్తు తెలియని కుటుంబంతో లింకు కావడంతో రుణమాఫీ కాలేదు

నాకు ఆరు ఎకరాల భూమి ఉంది. బజార్‌హత్నూర్ తెలంగాణ గ్రామీణ బ్యాంకులో రూ.లక్ష 60 వేల రుణం తీసుకున్నాను. ప్రతి ఏటా రెన్యూవల్ చేసుకుంటు వస్తున్నాను. కానీ నాకు రుణమాఫీ కాలేదు. తీరా అధికారులను అడిగితే నా బ్యాంకు ఖాతా ఆధార్‌లింకుతో వేరే కుటుంబ సభ్యులు లింకు కావడంతో నా రుణం మొత్తం రూ.4లక్షలు చూపిస్తోంది. అర్హత ఉండి వేరే వాళ్ల కుటుంబ సభ్యులు లింకు ఉండడంతో నాకు కావాల్సిన రుణమాఫీ రాకుండా పోయింది. పలుమార్లు అధికారులకు అర్జీల రూపంలో ఇచ్చిన నా సమస్యకు పరిష్కారం దొరుకుతా లేదు.

-పెందూరు జ్యోతిరాం, రైతు, దేద్రా

శాంతి భద్రతలు పరిరక్షించడమే లక్ష్యం

బైంసా, ఫిబ్రవరి 12 : పోలీసులు ప్రజలకు మరింత దగ్గరయ్యేలా శాంతి భద్రతలు పరిరక్షిస్తూ ముందుకు సాగడమే లక్ష్యంగా జిల్లా పోలీసు శాఖ పని చేస్తుందని ఎస్పీ జానకీ షర్మిల అన్నారు. బుధవారం నిర్మల్ జిల్లా బైంసాలోని ఎస్పీ క్యాంపు కార్యాలయంలో ప్రజావాణి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రజలు మూడో వ్యక్తి ప్రమేయం, ఎలాంటి పైరవీలు లేకుండా స్వచ్ఛందంగా పోలీసు సేవలను వినియోగించుకుంటూ వారి సమస్యలు చట్టప్రకారం పరిష్కరించుకునేలా చూస్తున్నామన్నారు. అంతేగాకుండా వివిధ రకాల సమస్యలతో వచ్చిన బాధితుల సమస్యలు అడిగి సత్వర పరిష్కారానికి సంబంధిత అధికారులు తక్షణమే విచారణ చేపట్టి బాధితులకు న్యాయం చేకూర్చాలని ఆదేశించామన్నారు. కార్యక్రమంలో ఏఎస్పీ అవినాశ్ కుమార్, ముథోల్ సీఐ మల్లేశ్, ఎస్ఐ అశోక్ పాల్గొన్నారు.

ఫిర్యాదులు స్వీకరిస్తున్న నిర్మల్ ఎస్పీ జానకీషర్మిల

జాతీయ సదస్సులో ఉట్నూర్ ఉపాధ్యాయులు

ఉట్నూర్, ఫిబ్రవరి 12: హైదరాబాద్‌లోని కేంద్రియ విశ్వ విద్యాలయంలో ట్రెండ్స్ అండ్ ఇన్‌సైడ్ ఎడ్యుకేషన్ టెక్నాలజీ ఎన్ఈజీ 2020 అనే అంశంపై రెండు రోజుల పాటు నిర్వహించిన సదస్సులో ఉట్నూర్ ఉపాధ్యాయులు కుమ్రం శ్రీనివాస్, జాదవ్ రాజ్‌కుమార్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఒక పరిశోధన పత్రాన్ని సమర్పించారు. అనంతరం వారు మాట్లాడుతూ ప్రాథమిక స్థాయిలో ఉపాధ్యాయులు, విద్యార్థులు ఆంగ్ల భాషను అభ్యసించడంలో ఎదుర్కొంటున్న సమస్యల గురించి వివరించారు. ఈ సదస్సుకు ఎంపిక కావడం జిల్లా విద్యారంగ సమస్యలు వివరించడంతో స్థానిక ఉపాధ్యాయులు, పోషకులు అభినందించారు.

ఎస్సీ వర్గీకరణను చట్టప్రకారంగా చేయాలి



మాట్లాడుతున్న మాల సంక్షేమ సంఘం అధ్యక్షుడు కొప్పుల రమేష్

ఎదులాపురం, ఫిబ్రవరి 12 : ఎస్సీ వర్గీకరణను సీఎం రేవంత్ రెడ్డి ఏకపక్షంగా వ్యవహరించి అసెంబ్లీలో బిల్లు పెట్టారని, అమోదానికి ఏకసభ్య కమిషన్‌ను ఏర్పాటు చేసి చైర్మన్‌గా నియమించారని మాల సంక్షేమ సంఘం అధ్యక్షుడు కొప్పుల రమేశ్ అన్నారు. బుధవారం ఆదిలాబాద్ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎస్సీ వర్గీకరణపై ప్రభుత్వం ఏర్పాటు చేసిన కమిషన్‌కు చట్టబద్ధత లేదని, వర్గీకరణ విషయంలో తప్పుడు లెక్కలు చూపుతున్నారని పేర్కొన్నారు. వర్గీకరణను చట్ట ప్రకారంగా అమలు చేయాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ మాలలపై నిర్లక్ష్య ధోరణి అవలంబిస్తుందని వచ్చే ఎన్నికల్లో గుణపాఠం చెబుతామని హెచ్చరించారు. కార్యక్రమంలో జిల్లా సభ్యులు మల్లన్న, రాజేశ్వర్, ప్రహ్లద్, కిరణ్, సుధీర్, రాఘవేంద్ర పాల్గొన్నారు.

లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో జాన్సన్‌నాయక్ పూజలు

పూజలు చేస్తున్న భూక్యా జాన్సన్‌నాయక్

ఖానాపూర్, ఫిబ్రవరి 12 : నిర్మల్ జిల్లా ఖానాపూర్‌లోని శ్రీ వెంకటలక్ష్మీ నర్సింహస్వామి ఆలయంలో బుధవారం బీఆర్ఎస్ ఖానాపూర్ నియోజకవర్గ ఇన్‌చార్జి భూక్యా జాన్సన్ నాయక్ ప్రత్యేక పూజలు చేశారు. అర్చకులు తీర్థ ప్రసాదాలు అందజేశారు. అనంతరం ఆలయ కమిటీ సభ్యులు జాన్సన్ నాయక్‌ను శాలువాతో సన్మానించారు. ఆయన వెంట నాయకులు సుమన్, చంద్రవాస్, జనార్దన్ ఉన్నారు.

పరామర్శ

ఖానాపూర్ రూరల్, ఫిబ్రవరి 12: నిర్మల్ జిల్లా ఖానాపూర్ మండలంలోని నడింపల్లెకు చెందిన కుమార్ కాలు ఇటీవల విరిగిపోవడం, పాత ఎల్లాపూర్‌కు చెందిన అలిశెట్టి నారాయణకు హార్ట్ సర్జరీ కావడంతో ఇంటివద్ద విశ్రాంతి తీసుకుంటున్న సమయంలో బీఆర్ఎస్ ఖానాపూర్ నియోజకవర్గ ఇన్‌చార్జి భూక్యా జాన్సన్ నాయక్ పరామర్శించారు. ఆయన వెంట నాయకులు కొక్కుల ప్రదీప్, కొక్కుల శేఖర్, ధర్మరాజు, గాంధీ, గ్రామస్తులు ఉన్నారు.

రాష్ట్ర స్థాయి పోటీల్లో విద్యార్థిని ప్రతిభ



విద్యార్థినిని అభినందిస్తున్న క్రీడల నిర్వాహకులు

నిర్మల్ అర్బన్, ఫిబ్రవరి 12 : హైదరాబాద్‌లోని గచ్చిబౌలి స్టేడియంలో ఈ నెల 8 నుంచి జరుగుతున్న తెలంగాణ రాష్ట్ర బ్యాడ్మింటన్ ఛాంపియన్ షిప్ పోటీల్లో నిర్మల్‌లోని రవి ఉన్నత పాఠశాలలో ఏడో తరగతి చదువుతున్న అనుముల శ్రీ వైష్ణవి అండర్-13 బాలికల విభాగంలో సింగిల్స్, డబుల్స్‌లో రాష్ట్ర స్థాయిలో ప్రథమ స్థానం సాధించింది. ఈ పోటీల్లో ప్రతిభ కనబర్చిన శ్రీ వైష్ణవిని ప్రిన్సిపాల్ రాణి, కరస్పాండెంట్ వెంకటేశ్వర్ రావు, ఉపాధ్యాయులు అభినందించారు.

క్షయ నివారణకు చర్యలు

నార్నూర్, ఫిబ్రవరి 12 : క్షయ నివారణకు చర్యలు తీసుకుంటున్నట్లు ఆరోగ్య పర్యవేక్షకుడు చౌహాన్ చరణ్‌దాస్ అన్నారు. బుధవారం ఆదిలాబాద్ జిల్లా నార్నూర్‌లోని సామాజిక ఆరోగ్య కేంద్రంలో ఉచిత క్షయ తెమడ పరీక్షల క్యాంపు ఏర్పాటు చేశారు. 50 మందికి క్షయ వ్యాధి నిర్ధారణ పరీక్షలు చేశామని తెలిపారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది సుశీల, జాదవ్ రవీందర్, జ్యోతిలక్ష్మి, రత్నబాయి, నీలాబాయి పాల్గొన్నారు.

ఎస్సీ రిజర్వేషన్ నేతకానిలకు అన్యాయం

ఉట్నూర్ రూరల్, ఫిబ్రవరి 12: రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన ఎస్సీ రిజర్వేషన్‌లో నేతకానిలకు అన్యాయం జరిగిందని నేతకాని సంఘం మండలాధ్యక్షుడు గొల్లపెల్లి నర్సయ్య అన్నారు. నేతకాని రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు హైదరాబాద్‌లోని సోమాజిగూడలో నిర్వహించే రౌండ్ టేబుల్ సమావేశానికి బుధవారం ఉట్నూర్ మండలానికి చెందిన నాయకులు తరలివెళ్లారు. తరలివెళ్లిన వారిలో నేతకాని మండల నాయకులు బోర్లకుంట దుర్గయ్య నేత, మహేందర్ నేత, దూట రాజేశ్వర్ నేత, జాడి మల్లయ్య నేత, సోగల ప్రవీణ్ నేత, పవన్ నేత, వినోద్ నేత ఉన్నారు.

వ్యక్తిగత ప్రమాద బీమా చెక్కు అందజేత

బాధితురాలికి చెక్కు అందజేస్తున్న ఎస్‌బీఐ అధికారులు

నార్నూర్, ఫిబ్రవరి 12 : ఆదిలాబాద్ జిల్లా నార్నూర్‌లోని దుర్గనగర్ కాలనీకి చెందిన రాథోడ్ అరుణ భర్త రాథోడ్ ప్రకాశ్ ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. దీంతో బుధవారం ఎస్‌బీఐ బ్యాంకు ఎదుట ఆమెకు వ్యక్తిగత ప్రమాద బీమా రూ.20 లక్షల చెక్కును బ్యాంకు అధికారులు అందజేశారు. కార్యక్రమంలో ఎస్‌బీఐ బ్యాంక్ ఆర్‌బీవో కే సురేశ్, బ్యాంక్ మేనేజర్ మాలోత్ రవీందర్, బ్యాంక్ అధికారులు రవి, వెంకటకృష్ణ, ప్రదీప్, మహేశ్, బాలకృష్ణ, సిబ్బంది పాల్గొన్నారు.

కుభీర్ పీహెచ్‌సీ వైద్యుడిగా విజేశ్

కుభీర్, ఫిబ్రవరి 12 : నిర్మల్ జిల్లా కుభీర్‌లోని ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి డాక్టర్ విజేశ్‌ను నియమిస్తున్నట్లు డీఎంహెచ్‌వో ఆదేశాలు జారీ చేశారు. దీంతో ఆయన పీహెచ్‌సీలో బాధ్యతలు స్వీకరించారు. ఇంతకాలం ఆర్బీఎస్‌కే (ఆయుష్) వైద్యురాలు వసుంధర పని చేస్తున్న తరుణంలో ఎంబీబీఎస్ చేసిన వైద్యుడు ఇక్కడికి రావడంతో మండల వాసులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

పాన్ షాపులో చోరీ

ఎదులాపురం, ఫిబ్రవరి 12: ఆదిలాబాద్ పట్టణం భుక్తాపూర్‌లోని మహారాజ పాన్ షాపులో రూ.23 వేలు చోరీ జరిగినట్లు వన్ టౌన్ సీఐ సునీల్ కుమార్ తెలిపారు. మంగళవారం రాత్రి 10.30 గంటలకు షాపును యజమాని విజయ్ సింగ్ మూసివేసి ఇంటికి వెళ్లాడు. బుధవారం ఉదయం షాపుకు వచ్చి చూసేసరికి షటర్ ధ్వంసం చేసి ఉంది. కౌంటర్‌లో ఉన్న రూ.23 వేలు, సెల్‌ఫోన్ చోరీ చేశారు. యజమాని ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

అటవీ, వన్యప్రాణుల రక్షణ కోసం గ్రామస్తులతో ప్రతిజ్ఞ

ఎదులాపురం, ఫిబ్రవరి 12 : అటవీ, వన్యప్రాణుల రక్షణ కోసం ఆదిలాబాద్ జిల్లా గుడిహత్నూర్ మండలంలోని కినార్‌పల్లి గ్రామస్తులతో బుధవారం అటవీ శాఖ అధికారి ప్రశాంత్ ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో గ్రామస్తులు పాల్గొన్నారు.

నమస్తే తెలంగాణ CLASSIFIED
GOLD FINANCE
★ మీ బంగారం మణప్పరం, ముత్తూట్, మార్వాడీ షాప్స్, ఏ ఇతర ఫైనాన్స్‌లో ఉన్నా, మా డబ్బుతో విడిపించి మార్కెట్ ధరకు కొనబడును. 9160077916. స్పాట్ క్యాష్.
NT-337308

గమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధము లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

Classified Ads
మీకు కావలసిన సమాచారం కొరకు సులభమైన మార్గం.. మన
నమస్తే తెలంగాణ
క్లాసిఫైడ్స్‌లో ప్రకటన ఇవ్వడం
4 లైన్ల ప్రకటన కేవలం
200/- మాత్రమే
ప్రతి ఎక్స్‌ట్రా లైన్‌కి
50/- మాత్రమే
3+1 స్కీం కలదు
ప్రకటనల విభాగం...
GST 5% వర్తించును
మంచిర్యాల: 91827 77676, ఆసిఫాబాద్: 91827 77679
నిర్మల్: 91827 77671, 91827 77677

క్రీడలతో మానసికోల్లాసం



గెలుపొందిన జట్టుకు బహుమతి అందజేస్తున్న మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ తిరుమల్‌గౌడ్

గుడిహత్నూర్, ఫిబ్రవరి 12 : క్రీడలతో మానసికోల్లాసం కలుగుతుందని మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ తిరుమల్‌గౌడ్ అన్నారు. ఆదిలాబాద్ జిల్లా గుడిహత్నూర్ మండలం కమలాపూర్ గ్రామంలో నెల రోజులుగా కొనసాగుతున్న ప్రీమియర్ లీగ్ క్రికెట్ టోర్నమెంట్ బుధవారం ముగిసింది. ఈ కార్యక్రమానికి ఆయన హాజరై మాట్లాడారు. టోర్నమెంట్లు పల్లె క్రీడాకారులతో స్నేహభావాన్ని మెరుగుపరుస్తుందన్నారు. ఫైనల్ మ్యాచ్‌లో వాగాపూర్, ఆదిలాబాద్ జట్లు తలపడగా వాగాపూర్ జట్టు ప్రథమ, ఆదిలాబాద్ జట్టు ద్వితీయ బహుమతి కైవసం చేసుకుంది. ప్రథమ బహుమతి బోథ్ ఎమ్మెల్యే జాదవ్ అనిల్ రూ.30వేలు, రెండవ బహుమతి సీతాగోంది మాజీ ఉపసర్పంచ్ అరుగుల సంతోష్ గౌడ్ రూ 20వేలు అందజేశారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు జంగు,ఆశన్న యాదవ్, బేర దేవన్న, భీంరావ్, రాందాస్ పాటిల్, మాధవ్ తెలంగె, ఖలీల్, సుధాకర్, భూమన్న, నర్సింగ్, సదానందం, జమీల్, క్రీడాకారులు పాల్గొన్నారు.

పాఠశాలను తనిఖీ చేసిన ట్రైనీ కలెక్టర్

విద్యార్థుల నుంచి జవాబులు అడిగి తెలుసుకుంటున్న ట్రైనీ కలెక్టర్ అభిజ్ఞాన్ మాలవీయ

ఎదులాపురం, ఫిబ్రవరి 12 : ఆదిలాబాద్‌లోని ప్రభుత్వ బాలిక ఉన్నత పాఠశాలను బుధవారం ట్రైనీ కలెక్టర్ అభిజ్ఞాన్ మాలవీయ, జిల్లా విద్యాశాఖ అధికారి ప్రణీతతో కలిసి తనిఖీ చేశారు. పదో తరగతి విద్యార్థులకు సాయంత్రం నిర్వహిస్తున్న ప్రత్యేక తరగతులను పరిశీలించారు. విద్యార్థులకు సాయంత్రం అల్పాహారంగా శనగలు అందజేశారు. ఎస్ఎస్సీ పరీక్షల్లో మంచి మార్కులు తీసుకొని రావడానికి విద్యార్థులకు తగు సూచనలు చేశారు. వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని ఉపాధ్యాయులకు సూచించారు. ఆయన వెంట ఉపాధ్యాయులు ఉన్నారు.

జొన్నల కేంద్రం ఏర్పాటు చేయండి

బజార్‌హత్నూర్, ఫిబ్రవరి 12: ఆదిలాబాద్ జిల్లా బజార్‌హత్నూర్‌లో జొన్నల కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని రైతులు బుధవారం మండల కేంద్రంలోని రైతు వేదికలో నిర్వహించిన పైలెట్ ప్రజాఫిర్యాదుల విభాగంలో మండల ప్రత్యేకధికారి మోహన్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ మండలంలోని 33 గ్రామల రైతులు పండించిన జొన్న పంటను ఇచ్చోడకు తీసుకెళ్లి మార్కెట్ యార్డులో అమ్ముకోవాలంటే రైతులకు దూరభారంతో పాటు ప్రయాణ ఖర్చులు అధికమవుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. పంటను అమ్ముకునే వరకు మార్కెట్‌లో నిరీక్షణ తప్పదని పేర్కొన్నారు. కావున బజార్‌హత్నూర్‌లోనే జొన్నల మార్కెట్ సబ్‌సెంటర్‌ను ఏర్పాటు చేసి రైతుల కష్టాలను తొలగించాలని కోరారు. ఇక్కడ రైతులు రాము, రమణ, శేఖర్, గంగారెడ్డి, సాయన్న, గంగయ్య ఉన్నారు.

రోడ్డు ప్రమాదంలో ముగ్గురికి గాయాలు

నేరడిగొండ, ఫిబ్రవరి 12 : ఆదిలాబాద్ జిల్లా నేరడిగొండ మండలంలోని జాతీయ రహదారిపై కుప్టిఘాట్ వద్ద కారు అదుపు తప్పి డివైడర్‌ను ఢీకొనడంతో ముగ్గురికి గాయాలయ్యాయి. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. నారాయణపేట్ జిల్లా మోర్కల్ మండలం మేడారం గ్రామానికి చెందిన ఆంజనేయులు వారి కుటుంబ సభ్యులతో కలిసి కుంభమేళాకు వెళ్లి తిరిగి వస్తున్నారు. మార్గమధ్యంలో కుప్టిఘాట్ వద్ద అదుపుతప్పి డివైడర్‌ను ఢీ కొంది. ఈ ప్రమాదంలో లక్ష్మి, సువర్ణ, ఆంజనేయులుకు గాయాలయ్యాయి. క్షతగాత్రులను చికిత్స నిమిత్తం 108లో నిర్మల్ ఏరియా దవాఖానకు తరలించారు.

ఇసుక కుప్పలు సీజ్

ముథోల్, ఫిబ్రవరి 12 : నిర్మల్ జిల్లా ముథోల్‌లో అక్రమంగా నిల్వ చేసిన దాదాపు 5 టిప్పర్ల ఇసుకను రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ నారాయణ సిబ్బందితో కలిసి సీజ్ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కలెక్టర్ ఆదేశానుసారం అక్రమంగా నిల్వ ఉంచిన ఇసుక కుప్పలను సీజ్ చేసినట్లు తెలిపారు. ఎవరైనా అక్రమంగా ఇసుక తరలిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

ఇసుక డంప్‌లు..

బైంసా, ఫిబ్రవరి 12 : నిర్మల్ జిల్లా బైంసాలోని పలుచోట్ల అక్రమంగా నిల్వ ఉంచిన ఇసుక డంప్‌లను సీజ్ చేసినట్లు తహసీల్దార్ ప్రవీణ్ కుమార్ తెలిపారు. ఈ మేరకు ఆర్ఐ జయరావు నేతృత్వంలో పట్టణంలోని పలు ప్రాంతాల్లో తనిఖీలు చేయగా, వంద ట్రాక్టర్ల ఇసుక డంప్‌లు గుర్తించినట్లు పేర్కొన్నారు. ఈ మేరకు వాటిని స్వాధీనం చేసుకొని తదుపరి చర్యలకు మైనింగ్ శాఖ అధికారులకు నివేదించనున్నట్లు వెల్లడించారు.

రైతులకు అందుబాటులో యూరియా

ఖానాపూర్, ఫిబ్రవరి 12 : నిర్మల్ జిల్లా ఖానాపూర్ పీఏసీఎస్ ఆధ్వర్యంలో మండల రైతులకు యూరియా బ్యాగులు అందుబాటులో ఉన్నాయని సీఈవో భూమి ఆశన్న తెలిపారు. యూరియా 45 కిలోల బ్యాగు సబ్సిడీపై ప్రభుత్వ ధర రూ. 270 విక్రయిస్తున్నామని పేర్కొన్నారు. ఎరువులు కావాల్సిన రైతులు తమ పట్టాపాస్ పుస్తకం, ఆధార్‌కార్డు జిరాక్స్ కాపీలను తీసుకురావాలని సూచించారు.

ప్రజావాణి నిరంతర ప్రక్రియ

ఇచ్చోడ(సిరికొండ), ఫిబ్రవరి 12: ప్రజావాణి నిరంతర ప్రక్రియ అని డీఎల్పీవో ఫణిందర్ అన్నారు. బుధవారం ఆదిలాబాద్ జిల్లా సిరికొండలోని రైతు వేదికలో పైలెట్ ప్రజావాణి ప్రజా ఫిర్యాదులో భాగంగా బహిరంగ విచారణ వేదికను నిర్వహించారు. ఇందిరమ్మ ఇండ్లు, గ్యాస్, రుణమాఫీ, పింఛన్ సమస్యపై అర్జీదారులు దరఖాస్తులు అందజేశారు. వాటికి సంబంధించిన సమస్యలు పరిష్కరించారు. కార్యక్రమంలో ఎంపీడీవో రవీందర్, తహసీల్దార్ తుకారాం, ఏఈ జైపాల్, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

ఇరుకు రోడ్లతో ట్రాఫిక్ కష్టాలు

ఖానాపూర్-నిర్మల్ జాతీయ రహదారిపై నిలిచిపోయిన భారీ వాహనాలు

ఖానాపూర్, ఫిబ్రవరి 12: నిర్మల్ జిల్లా ఖానాపూర్ మున్సిపాలిటీలోని ప్రధాన రహదారిలో ఏళ్ల తరబడి ట్రాఫిక్ సమస్య తీవ్రంగా ఉంది. బుధవారం పట్టణంలోని తెలంగాణ చౌరస్తాలోని ఖానాపూర్-నిర్మల్ జాతీయ రహదారిపై ఇరుకైన రోడ్లతో భారీ వాహనాలు నిలిచిపోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు. రోడ్డు విస్తరణ పనులు చేపట్టకపోవడంతో నిత్యం సమస్య పెరుగుతుందని మున్సిపల్ అధికారులు, పాలకులు పట్టించుకోవడం లేదని పట్టణ వాసులు, వాహనదారులు వాపోయారు. ప్రధాన చౌరస్తాలో సిగ్నల్స్ ఏర్పాటుతో పాటు కనీసం హోంగార్డులనైన నియమించాలని కోరుతున్నారు. పాలకులు ఖానాపూర్ అభివృద్ధిపై దృష్టి సారించాలని కోరుతున్నారు.

జిల్లా స్థాయి కబడ్డీ పోటీలు

కుంటాల, ఫిబ్రవరి 12 : నిర్మల్ జిల్లా కుంటాలలోని విజయ సాయి పాఠశాలలో కబడ్డీ అసోసియేషన్ ఆధ్వర్యంలో అండర్ 16 సబ్ జూనియర్ లెవెల్ పోటీలను నిర్వహించారు. ఈ పోటీల్లో జిల్లాలోని వివిధ పాఠశాలల నుంచి విద్యార్థులు పాల్గొన్నారు. ఎంపికైన క్రీడాకారులను వికారాబాద్‌లో జరిగే రాష్ట్ర స్థాయి పోటీలో పాల్గొంటారని అసోసియేషన్ సభ్యులు తెలిపారు. కార్యక్రమంలో ఎస్ఐ భాస్కరాచారి, కబడ్డీ అసోసియేషన్ జిల్లా కార్యదర్శి సునీల్, నాయకులు జీవీ రమణారావు, వెంకటేశ్, గజేందర్, జిల్లా ఇన్‌చార్జి శ్రీనివాస్ రెడ్డి, ఆర్గనైజింగ్ సెక్రటరీ ప్రేమలత, ప్రిన్సిపాల్ స్వప్న, పీఈటీలు పాల్గొన్నారు.